
# ఒక్క గంటలో తేల్చేయాలి..

## క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అప్రూవల్స్‌పై ఆరోగ్య బీమా సంస్థలకు ఐఆర్‌డీఏఐ ఆదేశాలు




- ఫైనల్ క్లెయిమ్ సెటిల్మెంట్ 3 గంటల్లో జరగాలి
- డిశ్చార్జ్ ఆలస్యమైతే అదనపు చార్జీల భారం ఇన్సూరర్లపైనే
- మాస్టర్ సర్క్యులర్‌లో బీమా రంగ రెగ్యులేటర్

న్యూఢిల్లీ, మే 29: ఆరోగ్య బీమా తీసుకున్న పాలసీదారుల నుంచి క్యాష్‌లెస్ చికిత్స కోసం వచ్చిన విజ్ఞప్తులపై సదరు బీమా కంపెనీలు ఒక్క గంటలో నిర్ణయం తీసుకోవాల్సిందేనని బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఓ మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. ఆరోగ్య బీమా వంటి అత్యవసర రంగంలో క్యాష్‌లెస్ క్లెయిమ్‌లను వీలైనంత వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఐఆర్‌డీఏఐ అభిప్రాయపడింది. అందుకే ఈ క్లెయిమ్‌లు వచ్చిన గంటలోగా ఏ సంగతన్నది తేల్చేయాలని ఇన్సూరర్లను ఆదేశించింది. కాగా, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై తాజాగా విడుదలైన ఈ మాస్టర్ సర్క్యులర్‌తో గతంలో జారీ చేసిన 55 సర్క్యులర్లు రద్దైపోయాయి. ఆరోగ్య బీమా పాలసీల్లో పాలసీదారులకు అందుబాటులో ఉండే అన్ని అర్హతలను ఈ మాస్టర్ సర్క్యులర్‌లోనే ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. పాలసీదారుల ప్రయోజనాలను కాపాడే విషయంలో ఈ సర్క్యులర్‌ను గొప్ప ముందడుగుగా కూడా అభివర్ణించింది. జూలై 31లోగా తామిచ్చిన ఈ మార్గదర్శకాలను అమల్లోకి తేవాలని కూడా గడువు పెట్టింది.

### వేగంగా సెటిల్మెంట్లు..

నిర్దిష్ట సమయంలోగా 100 శాతం క్యాష్‌లెస్ క్లెయిమ్ సెటిల్మెంట్ జరగాలన్నదే ఈ మాస్టర్ సర్క్యులర్ ఉద్దేశమన్న ఐఆర్‌డీఏఐ.. పాలసీ రెన్యువల్స్, సర్వీసింగ్, సమస్యల పరిష్కారానికి సాంకేతికంగా లేదా అందుబాటులో ఉన్న అన్ని ప్రభావవంతమైన చర్యలనూ ఆరోగ్య బీమా కంపెనీలు తీసుకోవాలన్నది. ఇక ప్రతీ పాలసీ డాక్యుమెంట్‌తో బీమా సంస్థ అందించే కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్) ఎంతో ముఖ్యమని చెప్పింది. బీమా అంటే.. బీమా చేసుకున్న మొత్తం, కవరేజీ, పరిధిలోకి రాని అంశాల వివరాలు, పరిమితులు, మినహాయింపులు, వెయిటింగ్ పీరియడ్స్ ఇలా అన్నింటి సమాహారమని వివరించింది.

### సర్క్యులర్‌లోని ముఖ్యాంశాలు

- నగదు రహిత చికిత్స కోసం పాలసీదారుని నుంచి వచ్చిన అభ్యర్థనపై ఆరోగ్య బీమా సంస్థలు తక్షణమే లేదా గంటలోగా నిర్ణయం తీసుకోవాలి.
- చికిత్స పూర్తయ్యాక దవాఖాన నుంచి వచ్చిన ఫైనల్ క్లెయిమ్‌ను మూడు గంటల్లోగా ఇన్సూరర్లు సెటిల్మెంట్ చేయాలి.
- బీమా సంస్థకు దవాఖాన క్లెయిమ్ పంపిన తర్వాత డిశ్చార్జి ఆలస్యమైతే పడే అదనపు చార్జీల భారం ఇన్సూరర్లదే.
- చికిత్స సమయంలో రోగి చనిపోతే సదరు క్లెయిమ్‌ను వెంటనే పూర్తిచేయాలి. దవాఖాన నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లేలా బీమా సంస్థలు చూడాలి.
- క్లెయిమ్ సెటిల్మెంట్ల కోసం బీమా సంస్థలకు పాలసీదారుడు ఎలాంటి డాక్యుమెంట్లనూ సమర్పించాల్సిన అవసరం లేదు. ఇందు కోసం చికిత్స చేసిన దవాఖాన నుంచి కావాల్సిన అన్ని డాక్యుమెంట్లను తీసుకోవాల్సిన బాధ్యత థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్స్ (టీపీఏ)దే.
- ఏదైనా కేసులో అంబుడ్స్‌మన్ సూచనలను 30 రోజుల్లోగా బీమా సంస్థలు అమలు చేయాల్సి ఉంటుంది. అలాకాకపోతే పాలసీదారునికి రోజుకు రూ.5,000 చొప్పున బీమా సంస్థ చెల్లించాలి.
- పాలసీ వ్యవధిలో ఎలాంటి క్లెయిమ్‌లు లేకపోతే.. సదరు పాలసీదారునికి బీమా సంస్థలు ప్రోత్సాహకాలిచ్చుకోవచ్చు. నో క్లెయిమ్ బోనస్ లేదా బీమా కవరేజీని పెంచడం లేక ప్రీమియం మొత్తంలో రాయితీ అందివ్వచ్చు.
- గతంలో పెద్ద ఎత్తున క్లెయిమ్‌లున్నాయని పాలసీ రెన్యువల్స్‌ను తిరస్కరించరాదు.

### బీమా పోర్టబిలిటీపై..

ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా (ఐఐబీ) పోర్టల్‌పై బీమా పోర్టబిలిటీకి పాలసీదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు సంబంధించి నిర్దిష్ట కాలవ్యవధులను ప్రస్తుత బీమా సంస్థకు, వెళ్లాలనుకునే కొత్త బీమా సంస్థకు స్పష్టం చేశామని ఐఆర్‌డీఏఐ తెలిపింది. ఇక బీమా ప్లాన్లు, రైడర్లకు సంబంధించి దవాఖానలకు, బీమా సంస్థలకు, పాలసీదారులకు స్పష్టత ఎప్పటికప్పుడు ఇస్తూనే ఉన్నామన్న ఐఆర్‌డీఏఐ.. అందరికీ అందుబాటు ధరల్లో ఆరోగ్య బీమా అందాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు చెప్పింది.

## టాలెంట్ హబ్‌గా హైదరాబాద్: కేపీఎంజీ

హైదరాబాద్, మే 29: టాలెంట్ హబ్‌గా హైదరాబాద్ మారుతున్నదని కేపీఎంజీ తాజాగా వెల్లడించింది. హైదరాబాద్‌తోపాటు నవీ ముంబై, పుణెలలో ప్రతిభ కలిగిన టెక్నాలజీ నిపుణులకు అధిక డిమాండ్ ఉన్నదని బుధవారం 'టాలెంట్ ఫిజబిలిటీ రిపోర్ట్‌లో పేర్కొంది. జీవన ప్రమాణాల్లో ఈమూడు నగరాలు మొదటి స్థానాల్లో నిలిచాయని తన నివేదికలో వెల్లడించింది. జీవన నాణ్యత, కనెక్టివిటీ, ప్రయాణ సమయం, భద్రత, ఆరోగ్య సంరక్షణ, గాలి నాణ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కేపీఎంజీ ఈ నివేదికను రూపొందించింది. కానీ, ఇదే సమయంలో అద్దె, మొత్తం ఖర్చులపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారని తెలిపింది.

# 75 వేల దిగువకు సెన్సెక్స్

- భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు
- నాలుగు రోజుల్లో 5 లక్షల కోట్లు ఆవిరి

ముంబై, మే 29: దేశీయ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనుకావడంతోపాటు మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూడటంతో వరుసగా నాలుగోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. వచ్చేవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలకానుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వు ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు లేకపోవడంతో మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపారు. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఒక దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 667.55 పాయింట్ల నష్టంతో 75 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 74,502.90 వద్ద స్థిరపడింది. ఈ నెల 27న సెన్సెక్స్ రికార్డు స్థాయి 76 వేలను అధిగమించిన విషయం తెలిసిందే. అటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 183.45 పాయింట్లు కోల్పోయి 22,704.70 వద్ద నిలిచింది. దీంతో లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గత నాలుగు సెషన్లలో మదుపరులు రూ.5.12 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.5,12,921.96 కోట్లు కోల్పోయి రూ.4,15,09,713.94 కోట్ల(4.98 ట్రిలియన్ డాలర్లు) వద్ద నిలిచింది.

- టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి.
- కానీ, పవర్ గ్రిడ్, సన్‌ఫార్మా, నెస్లె, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే బ్యాంకెక్స్ 1.37 శాతం, ఫైనాన్షియల్ సర్వీసులు 1.32 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ రంగ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- ఈ నెల 24 నుంచి ఇప్పటి వరకు సెన్సెక్స్ 915.14 పాయింట్లు లేదా 1.21 శాతం, నిఫ్టీ 183.45 పాయింట్లు నష్టపోయాయి.




## రాంకీ ఇన్‌ఫ్రా లాభం 84 కోట్లు

హైదరాబాద్, మే 29: గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.84 కోట్ల నికర లాభాన్ని గడించింది రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.48 కోట్లతో పోల్చుకుంటే 48శాతం వృద్ధిని కనబరిచిందని కంపెనీ సీఎఫ్‌వో ఎన్ఎస్ రావు తెలిపారు. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.581 కోట్లకు పెరిగినట్లు చెప్పారు. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.9,300 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయన్నారు. అలాగే వ్యాపార విస్తరణ కోసం రూ.280 కోట్ల నిధులను వచ్చే ఆరు నెలల్లో సేకరించాలనుకుంటున్నట్లు తెలిపారు.

## టీఎస్ఐ బిజినెస్ పార్క్‌కు షాపూర్‌జీ గుడ్‌బై

ముంబై, మే 29: ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న షాపూర్‌జీ పల్లోంజీ గ్రూపు..హైదరాబాద్‌లోని కమర్షియల్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు నుంచి వైదొలిగింది. టీఎస్ఐ బిజినెస్ పార్క్(హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్‌లో తనకున్న వాటాను సింగపూర్‌కు చెందిన జీఐసీకి విక్రయించింది. దీంతో సంస్థకు రూ.2,200 కోట్ల నిధులు సమకూరాయి. డిసెంబర్ 2019లో టీఎస్ఐబీపీహెచ్‌లో జర్మనీకి చెందిన బీమా సంస్థ అలయెంజ్ గ్రూపునకు ఉన్న వాటాను షాపూర్ పల్లోంజీ గ్రూపు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

## గృహోపకరణాలకు ఎల్ అండ్ టీ ఫైనాన్స్ రుణాలు

హైదరాబాద్, మే 29: ప్రముఖ నాన్ బ్యాంకింగ్ సేవల సంస్థ ఎల్అండ్‌టీ ఫైనాన్స్..గృహోపకరణాలకు సైతం రుణం ఇస్తున్నట్లు ప్రకటించింది. గరిష్ఠంగా రూ.75 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు, వడ్డీరేటు 9 శాతం నుంచి 10 శాతం స్థాయిలో వసూలు చేస్తున్నట్లు కంపెనీ సీఈవో సంజయ్ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు వరంగల్‌లో రూ.3 వేల కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసినట్లు, త్వరలో కరీంనగర్‌లో ప్రవేశించనున్నట్లు ప్రకటించారు.

## 'కంట్రోల్ ఎస్' మరో డాటా సెంటర్

### రూ.500 కోట్లతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సంస్థ



హైదరాబాద్‌లో కంట్రోల్‌ఎస్ డాటా సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హైదరాబాద్, మే 29: రాష్ట్రానికి చెందిన టెక్నాలజీ దిగ్గజం కంట్రోల్‌ఎస్..హైదరాబాద్‌లో మరో డాటా సెంటర్‌ను ప్రారంభించింది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ డాటా సెంటర్ సంస్థకిది మూడోది కావడం విశేషం. 1.34 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1,300 మంది కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ డాటా సెంటర్‌ను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో ఫిన్‌టెక్ సంస్థలు డాటా సెంటర్లు భాగమయ్యాయని, భవిష్యత్తులో ఈ రంగం మరింత వృద్ధి చెందే అవకాశాలున్నాయన్నారు. ముఖ్యంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కూడా డాటా సెంటర్ల అవసరం మరింత పెరిగిందని చెప్పారు. కృత్రిమ మేధస్సుతో అడ్వాన్స్ కూలింగ్ టెక్నాలజీతో తీర్చిదిద్దిన ఈ సెంటర్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా నిర్మించింది. గూగుల్, ఒరాకిల్, అజూర్, ఏడబ్ల్యూఎస్‌తో అనుసంధానం కానున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చిన మూడో డాటా సెంటర్‌ను కలుపుకొని మొత్తంగా దేశవ్యాప్తంగా ముంబై, చెన్నై, బెంగళూరు, నోయిడా, కోల్‌కతా, పాట్నాలో ఉన్న డాటా సెంటర్ల పూర్తి సామర్థ్యం 250 మెగావాట్లకు చేరుకుంది. 2029 నాటికి 600 మెగావాట్ల సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ అందుకుతగ్గట్టుగానే ప్రణాళికను వేగవంతం చేసినట్లు, దీంట్లో భాగంగానే నగరంలో మూడో డాటా సెంటర్‌ను నెలకొల్పినట్లు కంట్రోల్‌ఎస్ ఫౌండర్, సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరం డాటా సెంటర్ల హబ్‌గా మారుతున్నదని, కార్పొరేట్ సంస్థలు, క్లౌడ్ సర్వీసు సేవలు అందించే సంస్థలు ఇక్కడ అధికంగా ఉండటమే ఇందుకు కారణమన్నారు.

## ఈసీఎల్ ఫైనాన్స్, ఎడెల్‌వీజ్ ఏఆర్‌సీలపై ఆంక్షలు

ముంబై, మే 29: ఈసీఎల్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎడెల్‌వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ) లిమిటెడ్‌లపై రిజర్వ్ బ్యాంక్ కొరడా ఝుళిపించింది. బుధవారం వ్యాపారపరమైన ఆంక్షల్ని విధించింది. రుణాల మంజూరు, మొండి బకాయి (ఎన్‌పీఏ)ల కొనుగోలు, ఇతరత్రా అంశాల్లో లోపాలు, నిబంధనల ఉల్లంఘనలే ఇందుకు కారణం. ఇప్పటికే తీసుకున్న రుణాలను చెల్లించలేకపోతున్న రుణగ్రహీతలకు.. ఆ బకాయిలను తీర్చేందుకు కొత్తగా మళ్లీ రుణాలను మంజూరు చేస్తున్నారన్నదానిపై సెంట్రల్ బ్యాంక్ తీవ్రంగా స్పందించింది. తద్వారా ఒత్తిడిలో ఉన్న రుణాలను ఖాతా పుస్తకాల నుంచి తొలగిస్తున్నారని మండిపడింది. ఈ రకమైనవి నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ)ను పెంచుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే సూపర్‌వైజరీ చర్యలకు దిగింది. రీపేమెంట్లు, ఖాతాల మూసివేత మినహా కొత్త రుణాల మంజూరు తదితర మిగతా అన్ని రకాల లావాదేవీలను ఆపేయాలని ఈసీఎల్ ఫైనాన్స్‌ను ఆర్బీఐ ఆదేశించింది. అలాగే సెక్యూరిటీ రిసీప్ట్‌లు (ఎస్ఆర్‌లు)సహా ఒత్తిడిలో ఉన్న రుణాల కొనుగోలు వంటివన్నింటినీ నిలిపివేయాలని ఎడెల్‌వీజ్ ఏఆర్‌సీకి కూడా స్పష్టం చేసింది. తమ ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కూడా ఆర్బీఐ ఈ సందర్భంగా ప్రకటించింది.

### వరుస ఘటనలు..

బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో వరుసగా చోటుచేసుకుంటున్న నిబంధనల ఉల్లంఘనలు ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నాయిప్పుడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్, జేఎం ఫైనాన్షియల్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఇలా చెప్పుకుంటూపోతే.. ఆర్బీఐ నుంచి ఆంక్షలు ఎదుర్కొన్న సంస్థల జాబితా పెద్దగానే ఉన్నది మరి.

## మహిళల కోసం ఇండిగో ప్రత్యేక ఆఫర్

న్యూఢిల్లీ, మే 29: మహిళల పక్కనే విమాన సీటు బుకింగ్ చేసుకునే అవకాశాన్ని మహిళలకు కల్పించింది దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో. ఇందుకోసం ప్రత్యేక ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది సంస్థ. ఇప్పటికే మహిళలు బుకింగ్ చేసుకున్న సీటు పక్కనే మరో మహిళ సీటు బుకింగ్ చేసుకునే విధంగా ఈ ఫీచర్ పనిచేయనున్నదని తెలిపింది. మహిళా ప్రయాణికులకు సౌకర్యవంతం గా తమ ప్రయాణ అనుభవాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ సరికొత్త ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వెబ్ చెక్- ఇన్ సమయంలో మాత్రమే మహిళా ప్రయాణికులు బుక్ చేసుకున్న సీట్ల పక్కనే బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. గడిచిన నెలలో ఇండిగో విమానాల్లో 80 లక్షల మంది ప్రయాణించారు.

